సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం, 19, జూన్, 2023



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



కేసు పక్కదారి పట్టిస్తున్నారు

చందుర్తి: కోరెం యువకుడు శివ మృతి కేసును పోలీసులు పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్తులు ఆదివారం ఆందోళనకు దిగారు.

-II లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.0/31.0

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజీవ్ క్విజ్‌లో పాల్గొనాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: రాజీవ్‌గాంధీ క్విజ్ పోటీల్లో యువత, విద్యార్థులు పాల్గొనాలని సిరిసిల్ల కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ కోరారు. జిల్లా గ్రంథాలయంలో ఆదివారం పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులను కలిసి మాట్లాడారు. ఆన్‌లైన్‌లో జరిగే క్విజ్ పోటీల్లో పాల్గొనే వారికి పోటీపరీక్షలతోపాటుగా తెలంగాణ సంస్కృతి, చరిత్రపై పట్టు సాధిస్తారన్నారు. ఎక్కడ ఉన్నా సరే మొబైల్ ఫోన్ ద్వారా పరీక్షకు హాజరుకావచ్చని.. 60 ప్రశ్నలకు 60 నిమిషాలలో సమాధానాలు రాయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. చిందం శ్రీనివాస్, అన్నల్‌దాస్ భాను, దేవరాజు, వేణు, రాజు, రవి, మనోహర్ పాల్గొన్నారు.

సిరుల ఖిల్లా సిరిసిల్ల



కవులను సన్మానిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: సిరులు కురిసే ఖిల్లా.. సిరిసిల్లగా సాహితీ సమితి సభ్యులు కవితాగానం చేశారు. స్థానిక గాంధీనగర్ హనుమాన్ ఆలయంలో 'తెలంగాణ అస్తిత్వం' అనే అంశంపై ఆదివారం జరిగిన కార్యక్రమంలో కవులు పాల్గొన్నారు. తొమ్మిదేళ్లలో సిరిసిల్ల అభివృద్ధిపై కవితలతో గళం విప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో తమ వంతుగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కోడం నారాయణ, ఆంకారపు రవి, మోత్కుల భాగ్యలక్ష్మి, మేర్గు లక్ష్మణ్, తడుక శ్రీహరి, వడ్డేపల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'పద్మశాలీలను విస్మరించడం శోచనీయం'



మాట్లాడుతున్న వేణు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు ప్రవేశపెట్టిన బీసీలకు రూ.లక్ష పథకంలో పద్మశాలీలను విస్మరించడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఆదివారం నిర్వహించిన పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. చేనేత, పవర్‌లూమ్ రంగాల్లో భారీ నష్టాలతో పద్మశాలీలు ఆర్థికంగా చితికిపోయి అసువులు బాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పద్మశాలీలను రూ.లక్ష పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. అజ్జ వేణు, మంచికట్ల రమేశ్, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి యథాతథం

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి యథాతథంగా ఉంటుందని జిల్లా అధికారులు ఆదివారం తెలిపారు. గత సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రద్దు చేయగా.. ఈ సోమవారం ఎప్పటిలాగే నిర్వహిస్తామని వెల్లడించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి(సిరిసిల్ల): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ కోరారు. వీర్నపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కరువైందన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను మరమ్మతు చేయాలని కోరారు. సరిపడా అధ్యాపకులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు.

ఎండుతున్న వరినారు



చందుర్తి(వేములవాడ): బండపల్లి శివారు బత్తాయిగుట్ట ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వరి నారుమడులు ఎండిపోతున్నాయి. వేసవిలోనే విద్యుత్‌లైన్ మరమ్మతులు పూర్తిచేయాల్సిన సెస్ అధికారులు నారుమడులు పోసిన తర్వాత పనులు చేపట్టారు. దీంతో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. ఈ విషయంపై సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డిని వివరణ కోరగా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యమైందని తెలిపారు.

మహిళలకు బీ(ధీ)మా

- రోజుకు రూ.1.19 పైసలతో.. రూ.2 లక్షల బీమా
- జిల్లాలో 1.10 లక్షల మందికి అవకాశం
- 9,810 మహిళా స్వశక్తి సంఘాల్లో అమలు

'తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన బోదాసు దేవవ్వ(45) దినసరి కూలి. ఆమె భర్త ఎల్లయ్య కూడా కూలీ పనిచేస్తాడు. వీరికి ఇద్దరు పిల్లలు. దేవవ్వ స్వశక్తి మహిళా సంఘంలో సభ్యురాలు. 2022 జూలై 25న దేవవ్వ అనారోగ్యంతో మరణించారు. ఆమె మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉండడంతో బ్యాంకు అధికారులు ఆమె పేరిట బీమా చేయించి ఏటా రూ.436 ప్రీమియం చెల్లించారు. దేవవ్వ సహజ మరణం పొందగా ఆమె కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీమా సాయం అందింది.' ఒక్క దేవవ్వకే కాదు.. జిల్లాలో కొద్ది మంది మహిళలకు ఈ బీమా ఉంది. ఇప్పుడు జిల్లా డీఆర్‌డీఏ అధికారులు వంద శాతం స్వశక్తి సంఘాల సభ్యులకు బీమా కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు.



స్వశక్తి సంఘాల మహిళలు(ఫైల్)

సిరిసిల్ల: జిల్లాలోని స్వశక్తి సంఘాలలోని మహిళలకు ధీమానిచ్చేలా బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి జరిగేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బ్యాంకర్ల సహకారంతో బీమా పథకాన్ని అమలు చేసే దిశగా ముందుకుసాగుతున్నారు. దురదృష్టవశాత్తు మరణిస్తే.. సదరు మహిళల కుటుంబాల్లోని నామినీకి రూ.2లక్షల బీమా సాయం దక్కుతుంది. జిల్లాలోని డీఆర్‌డీఏ అధికారులు జూన్ నెలాఖరులోగా మహిళా సంఘాల్లోని వంద శాతం సభ్యులకు బీమా చేయించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

ఇవీ బీమా పథకాలు

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై)లో ఏటా రూ.436 ప్రీమియం చెల్లిస్తే ఏడాదిపాటు రూ.2లక్షల బీమా వర్తిస్తుంది. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల వారికి ఈ పథకం వర్తిస్తుంది. సహజంగా, ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా ప్రయోజనం లభించనుంది. రోజుకు రూ.1.19 అతి తక్కువ ప్రీమియంతో బీమా లభిస్తుంది. ఇదే పీఎంఎస్‌బీవై పథకంలో కేవలం ప్రమాదబీమా పథకం వర్తించేలా వార్షిక ప్రీమియం రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల బీమా ఉంటుంది. ఇందుకు 18 నుంచి 70 ఏళ్ల వయస్సు వారు అర్హులు. ఇందులో సహజ మరణానికి బీమా వర్తించదు. ఈ రెండు బీమా పథకాలను మహిళల అర్హతను బట్టి డీఆర్‌డీఏ అధికారులు అమలు చేస్తున్నారు. ఒక్కసారి ఆన్‌లైన్‌లో నమోదయితే ఏటా బ్యాంకు ఖాతాల నుంచి మహిళల పేరిట ప్రీమియం డబ్బులు చెల్లిస్తారు. మహిళలకు తెలియకుండానే బీమాధీమాగా ఉంటుంది. ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు సదరు మహిళల కుటుంబాలకు ఆర్థికంగా ధీమానిస్తుంది.

జిల్లాలో స్వశక్తి సంఘాల స్వరూపం

గ్రామాలు	: 255
గ్రామ సంఘాలు	: 411
మండల సమాఖ్యలు	: 12
స్వశక్తి సంఘాల సంఖ్య	: 9,810
స్వశక్తి సంఘాల్లో సభ్యులు	: 1,10,090
ఇప్పటికే బీమా చేయించుకున్న మహిళలు	: 70,654

ఆధార్‌కార్డుతో నమోదు



మహిళల ఆధార్‌కార్డులను సేకరించి బ్యాంకు అధికారుల సూచనలతో సంతకాలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మా పరిధిలో 70 శాతం మహిళలకు బీమా వర్తింపజేసేలా వివరాలను బ్యాంకు అధికారులకు అందించాం. నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేస్తాం.

– బత్తిని పర్శరాం, ఏపీఎం, తంగళ్లపల్లి

ప్రతి ఒక్కరికీ బీమా చేస్తాం



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతి ఒక్క మహిళకు బీమా చేయిస్తాం. ఈమేరకు జిల్లా సమాఖ్యలో తీర్మానించాం. తక్కువ ప్రీమియంతో మహిళలకు బీమా లభిస్తుంది. మహిళలు అందరూ బీమా చేయించుకోవాలని చెప్పగా.. స్పందన బాగుంది. అందరూ చేయించుకుంటున్నారు.


– ఎ.సరిత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు

వందశాతం లక్ష్యం



స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు వంద శాతం బీమా చేయిస్తున్నాం. ఈ మేరకు క్షేత్రస్థాయి సిబ్బంది ఆధార్‌కార్డులు సేకరించి, బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేస్తూ.. సంతకాలు తీసుకుంటున్నారు. జిల్లాలో వందశాతం బీమా చేయించడమే మా లక్ష్యం.

– బి.గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో





మల్కపేట.. నీటి ఊట



సిరిసిల్ల: జిల్లాలో మరో జలాశయం ఆవిష్కరణ కాబోతుంది. కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ సిద్ధమైంది. కాళేశ్వరం-9వ ప్యాకేజీలో భాగంగా మల్కపేట రిజర్వాయర్‌ను నిర్మించారు. మధ్యమానేరు జలాశయం నుంచి సొరంగం ద్వారా నీరు మల్కపేటకు చేరింది. మూడు టీఎంసీల నీరు అందులో చేరితే మల్కపేట నీటి ఊటగా మారనుంది. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు 2.5 టీఎంసీల ప్రాజెక్టు కాగా.. అంతకంటే ఎక్కువ నీటి నిల్వ సామర్థ్యంతో మల్కపేటను నిర్మించారు. అనేక అవాంతరాలను దాటుతూ 9వ ప్యాకేజీ పూర్తయింది. రెండో పంపు ట్రయల్ రన్ ఆదివారం తెల్లవారుజామున సక్సెస్ కావడంపై సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. అధికారులను అభినందించారు. మల్కపేటకు చేరిన గోదావరి జలాలను రెండో మోటార్ ద్వారా ఎత్తిపోసే ప్రయోగం ఫలించింది.

ఎనిమిదేళ్లయినా హామీల అమలేది?

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్
- వేములవాడలో కాంగ్రెస్ నిరసన

వేములవాడ: రాజన్నకు ఏటా రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని 2015 జూన్ 18న గుడిమెట్ల సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఒక్క హామీ అమలుకాలేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రాజన్నగుడి మెట్ల వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటం ముందు 8 కొబ్బరి కాయలు, పూలదండలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఐదు నెలల్లో గుడిని అభివృద్ధి చేయాలని, లేకుంటే తాము అధికారంలోకి వచ్చాక భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు సైతం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన నిధులు తప్ప తెలంగాణ వచ్చాక ఒక్క పైసా కూడా వెచ్చించలేదన్నారు. రాజన్న సాక్షిగా ముంపు గ్రామాలకిచ్చిన మాట నిలుపుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే రాజన్న గుడి, వేములవాడ పట్టణం అభివృద్ధి కావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి, వకుళాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, చింతపండు స్వామి, షేక్ ఫిరోజ్, జెడ్పీటీసీ నాగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజన్న గుడి మెట్లపై 8 కొబ్బరికాయలు, పూలు పెట్టి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

చకచకా విద్యుత్‌లైన్ల పునరుద్ధరణ

- 57 రోజులకు ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు
- లూజ్‌వైర్లను సరిచేసిన సిబ్బంది



బావుసాయిపేటలో డీటీఆర్ బిగింపు

సాక్షి ఎఫెక్ట్


కరెంట్ రాదు.. కాలం కనికరించదు

'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనం

సిరిసిల్ల: జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలతో కూలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. కోనరావుపేట మండలం బావుసాయిపేటలో ఏప్రిల్ 22న ఈదురుగాలులకు, వడగళ్ల వానలతో విద్యుత్‌లైన్లు తెగిపోగా.. ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. 55 రోజులుగా పునరుద్ధరించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ 'కరెంట్ రాదు.. కాలం కనికరించదు' శీర్షికతో 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సెస్ చైర్మన్ చిక్కాల రామారావు బావుసాయిపేట, గోవిందరావుపల్లికి అవసరమైన విద్యుత్ సామగ్రిని పంపించారు. సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి పర్యవేక్షణలో కాంట్రాక్టర్ దినేశ్ పనులు చేస్తున్నారు. కోనరావుపేట సెస్ ఏఈ పృథ్వీధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, హెల్పర్ సాయి ఆధ్వర్యంలో విద్యుత్‌లైన్‌ల పునరుద్ధరణ పనులు సాగుతున్నాయి. రెండు రోజుల్లో విద్యుత్ సరఫరా అవుతుందని 'సెస్' ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. సాక్షి కథనంతో 57 రోజులకు విద్యుత్‌లైన్ల పునరుద్ధరణ పనులు వేగంగా సాగడం విశేషం.

మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు

- భగీరథ యజ్ఞం సఫలీకృతం
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎమ్మెల్యేలు రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

వేములవాడఅర్బన్: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందుతుందని.. సీఎం కేసీఆర్ చేపట్టిన భగీరథ ప్రయత్నం సఫలమైందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వేములవాడ మండలం అగ్రహారం శివారులోని మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరకని దుస్థితి ఉండేదన్నారు. ఆడబిడ్డలు కిలోమీటర్ల దూరం నడిచి తెచ్చిన బిందెడు నీటితో ఇంటిల్లిపాదీ గొంతు తడుపుకోవాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతో రూపుదిద్దుకున్న మిషన్ భగీరథ పథకం జలగోసకు శాశ్వత పరిష్కారం చూపిందన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు : రమేశ్‌బాబు

ఇంటింటికి నల్లా ద్వారా రక్షిత మంచినీరు అందిస్తున్నామని వివరించారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆలోచనలతో నీటి సమస్యను పరిష్కరించారన్నారు. అగ్రహారం దగ్గర మిషన్ భగీరథ ప్లాంట్‌కు నీళ్లను తీసుకొచ్చి ఇక్కడ శుద్ధి చేసి.. మూడు నియోజకవర్గాలకు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. మిడ్‌మానేరు నుంచి రాజన్న గుడి చెరువులోకి లిఫ్ట్ ద్వారా నీళ్లను ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు.

ఫ్లోరైడ్‌కు చెక్ : రవిశంకర్

తెలంగాణ ఏర్పాటు తర్వాత మిషన్ భగీరథ ద్వారా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించుకున్నామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. చొప్పదండిలోనూ ఫ్లోరైడ్ సమస్య చాలా ఉండేదని, ఇప్పుడు పుష్కలంగా మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందుతుందన్నారు.

పది రోజులకోసారి ట్యాంకులు శుభ్రం : కలెక్టర్

జిల్లాలోని అన్ని ట్యాంకులను ప్రతీ పది రోజులకోసారి శుభ్రం చేస్తున్నామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. జిల్లాలో 1.50 లక్షల ఇళ్లకు మిషన్ భగీరథ నీటి సరఫరా చేస్తున్నామన్నారు. అనంతరం మిషన్‌భగీరథపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, మిషన్ భగీరథ ఎస్‌ఈ రవీందర్, గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ విజయ్‌కుమార్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి తదితరులు ఉన్నారు.

ఏకాభిప్రాయం కుదిరేనా?

- దేశాయిపల్లి వాసులలో స్పష్టత కరువు
- ఓటీఎస్ కావాలని ఓ వర్గం..
- పునరావాసకాలనీ కోసం మరో వర్గం విన్నపం



ఆర్డీవోతో మాట్లాడుతున్న గ్రామస్తులు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలంలోని దేశాయిపల్లి నిర్వాసితుల మధ్య ఏకాభిప్రాయం కుదరక పరిహారం ఫైనల్ కావడం లేదు. గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం ఓటీఎస్(వన్ టైమ్ సెటిల్‌మెంట్) కోరుకుంటుంటే.. మరో వర్గం ఆర్‌అండ్‌ఆర్(పునరావాస కాలనీ) కావాలంటుంది.

అదనపు టీఎంసీ వరదకాల్వ

దేశాయిపల్లి కాళేశ్వరం అదనపు టీఎంసీ వరద కాల్వ ముంపు గ్రామం. ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితుల కోసం ప్రభుత్వం కాల్వ పరిసరాల్లో 11.20 ఎకరాలు గుర్తించింది. ప్రభుత్వం గుర్తించిన స్థలం వద్దని పలువురు స్థానిక ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ద్వారా కలెక్టర్‌కు గతంలో లేఖ రాయించారు. ఆ స్థలం వద్దని కొందరు కోర్టును ఆశ్రయించారు. నిర్వాసిత కుటుంబానికి రూ.6.60 లక్షల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.1.25లక్షల సాయం, 75 గజాల మేర ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

కుదరని ఏకాభిప్రాయం

దేశాయిపల్లి గ్రామస్తుల మధ్య ఏకాభిప్రాయం రావడం లేదు. అదనపు టీఎంసీ వరదకాల్వ నిర్వాసితులు ఏకాభిప్రాయంతో ఉంటే వన్‌టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) కింద రూ.11 లక్షల వరకు నగదు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే రూ.16 లక్షలు ఇవ్వాలని ఇటీవల మండలానికి వచ్చిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు కొందరు గ్రామస్తులు వినతిపత్రం అందించారు.

పెరుగుతున్న పీడీఎఫ్ గెజిట్ సంఖ్య

ప్రాజెక్టు డిస్ ప్లేస్‌డ్ ఫ్యామిలీ(పీడీఎఫ్) సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఏడాదిగా పీడీఎఫ్ ఫైనల్ కాలేదు. మొదట 119 మందితో తర్వాత 133, ఇప్పుడు 144 జాబితా ఇలా పీడీఎఫ్‌ల అంకెల సంఖ్య పెరగడం అనుమానాలకు తావిస్తోంది. పలువురు అనర్హుల పేర్లు పీడీఎఫ్‌ల జాబితాలో చేర్చారని ఆరోపిస్తున్నారు. గత గ్రామసభలో పీడీఎఫ్‌ల జాబితాలో ఏడాదిలో ఎంత మంది పెరుగుతారని ప్రశ్నించారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించాలి



కాల్వ నిర్మాణంలో మా ఇళ్లు పోతున్నయి. కాలనీ కోసం మొదట తీసుకున్న స్థలం వద్దు. అక్కడ వరదకాల్వ ఉంది. మాకు ఆ స్థలం పనికి రాదు. అనువైన ప్రదేశంలో కొత్తగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించి ఇవ్వాలి. కాలనీ ఏర్పాటుచేస్తే బడి, గుడి, కరెంట్, రోడ్లు ఇలా అన్ని వసతులు ఉంటాయి. మాకు కొత్త చోట కాలనీ నిర్మాణమే కావాలి.

– ఒంటెల రమ, దేశాయిపల్లి

పాత స్థలం వద్దు



గతంలో గుర్తించిన స్థలం అంతా నల్లరేగడి పక్కనే కాల్వ ఉంది. పాములు, తేళ్లు తిరుగుతాయి. ఆ స్థలం నివాసయోగ్యం కాదు. ఓటీఎస్ కింద డబ్బులు ఇస్తే మాకు నచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటాము.

–నిమ్మ వినోద్‌రెడ్డి, దేశాయిపల్లి

న్యాయం జరిగేలా చూడాలి



వరదకాల్వ నిర్మాణంలో రైతులు భూములు, ఇళ్లు కోల్పోతున్నారు. గతంలో గ్రామంలో నిర్వహించిన గ్రామసభల్లో ఇళ్లు పోయిన ప్రజల ఆవేదనను అధికారులు చూశారు. పెద్ద మనస్సుతో నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలి.

– ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్, దేశాయిపల్లి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



దేశాయిపల్లిలో కొందరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేయాలని, మరికొందరు వన్ టైం సెటిల్‌మెంట్ కింద డబ్బులు ఇవ్వాలని వినతిపత్రాలు అందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – దర్పెల్లి నరేశ్, తహసీల్దార్

క్లుప్తంగా

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న నాగరాజు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన మానుక నాగరాజును సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, నియోజకవర్గం అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు నియామక పత్రాన్ని నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంతో పాటు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, రాష్ట్ర యువజన పార్టీ అధ్యక్షుడు శివసేనా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిమల్ల భాను, రాకేశ్, ప్రశాంత్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని మల్లికార్జునస్వామి, రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి, ఆలయ హుండీలోని నగదును దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలోనూ ఆలయాల్లో దొంగతనం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఇలా అయితే.. ఆడుకునేదెలా..!



బండపల్లి క్రీడా మైదానంలో ఉన్న రాళ్లు

చందుర్తి(వేములవాడ): మండలంలోని బండపల్లి గ్రామం తెలంగాణ క్రీడా మైదానంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్రీడా మైదానంలో రైతులు టార్పాలిన్ కవర్లు వేసి ధాన్యం ఆరబోశారు. అకాల వర్షాలతో టార్పాలిన్ కవర్లు గాలి తాకిడికి లేచిపోకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రాళ్లు తెచ్చి టార్పాలిన్‌పై వేశారు. ఇటీవల యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముగియడంతో క్రీడా మైదానం మాత్రం రాళ్లతో నిండిపోయింది. గ్రామంలోని పాఠశాల విద్యార్థులు సెలవు రోజుల్లో ఆటలు ఆడుకుంటారు. క్రీడా మైదానంలోని రాళ్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా..



దెబ్బతిన్న కారు ముందుభాగం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారిపై డివైడర్‌ను ఢీకొని కారు బోల్తాపడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రం నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు పద్మనగర్ గ్రామ శివారుకు చేరుకోగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. కారులో ఉన్న నలుగురికి స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రజల చెంతకే పోలీస్ సేవలు

- జిల్లాలో 'మొబైల్ ఠాణా' కార్యక్రమానికి శ్రీకారం
- ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్

సిరిసిల్ల క్రైం : పోలీస్‌స్టేషన్ వెళ్లేందుకు చాలామంది భయపడుతుంటారు. స్టేషన్‌కు వెళ్తే గంటల తరబడి ఉండాల్సిందే. కానీ పోలీస్ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం ఇప్పటి వరకు చూడలేదు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వినూత్న ఆలోచనతో ప్రజల వద్దకే పోలీస్‌సేవలు అందుతున్నాయి. ఇప్పటి వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడాన్ని జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించగా, స్టేషన్ ఆవరణలో ఎస్పీ ఆధ్వర్యంలో ఠాణా దివస్‌ను నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించాలన్న ఉద్దేశంతో జిల్లాలో నూతనంగా 'మొబైల్ ఠాణా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వివిధ సర్కిళ్లలోని పోలీసులు ప్రజల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు.

గ్రామాల్లోకి పోలీస్ అధికారులు

ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ప్రతినెలా తన సర్కిల్‌లో ఉన్న పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నెలలో ఒకరోజు సందర్శించాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్జీలను స్వయంగా స్వీకరించాలి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలున్నాయి. సిరిసిల్ల రూరల్ సర్కిల్ పరిధిలోని వల్లంపట్ల, ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని బండలింగంపల్లి, వేములవాడ రూరల్ సర్కిల్ పరిధిలోని నూకలమర్రి, చందుర్తి సర్కిల్ పరిధిలోని నిమ్మపల్లి గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మొబైల్ ఠాణా కార్యక్రమాన్ని సంబంధిత ఇన్‌స్పెక్టర్ ప్రారంభించి అర్జీలను స్వీకరించారు. కాగా ఒకేరోజు పలు స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో 28 ఫిర్యాదులు అందినట్లు అధికారిక గణాంకాలున్నాయి. ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు రిజిస్టర్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ప్రణాళిక రూపొందించారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం. సమస్యలను త్వరగా పరిష్కరించేందుకే 'మొబైల్ ఠాణా' కార్యక్రమం చేపట్టాం. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

మూలనపడ్డ యంత్ర పరికరాలు

- మండల సమాఖ్యకు నెలరోజుల కింద మంజూరు
- ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించేందుకు వాయిదా
- ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో ప్రారంభానికి దూరం



కలుపు (మల్చర్) యంత్రం



గడ్డికట్టలు కట్టే యంత్రం

చందుర్తి (వేములవాడ) : అన్నిరంగాల్లో మహిళల భాగస్వామ్యం ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను మండల సమాఖ్యకు నెలరోజుల క్రితం అందించింది. ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో ప్రారంభానికి నోచుకోక మూలనపడ్డాయి. వ్యవసాయ పనులకు కలుపు యంత్రం, గడ్డి కట్టలు కట్టే యంత్రం, యంత్ర స్ప్రేయర్స్, రొటోవేటర్, తైవాన్ స్ప్రేలను సుమారు రూ.8.28లక్షల విలువల గల యంత్ర పరికరాలకు సెర్ప్ నుంచి రూ 1.90 లక్షలు మంజూరు కాగా, చందుర్తి మండల ప్రగతి సమాఖ్య నుంచి రూ.6.38 లక్షలు చెల్లించారు. ఈ డబ్బులతో నెలరోజుల కిందే చందుర్తి ఐకేపీ యంత్ర పరికరాలు కార్యాలయానికి చేరుకున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించేందుకు వాయిదా వేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తోంది. ఆరుతడి పంటలు సాగుచేసే రైతులకు యంత్ర పరికరాలు అద్దెకిస్తే ఇప్పటికే మండల సమాఖ్యకు సుమారు రూ.లక్షకు పైగా అద్దె సమకూరేదని సభ్యులు చర్చించుకుంటున్నారు. మిగులు పనులకైనా అద్దెకిచ్చేందుకు ఆరాటపడుతున్నా ప్రారంభానికి నోచుకోక పరికరాలు అలంకార ప్రాయంగా మిగిలిపోతున్నాయి. స్థానిక నాయకులు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎప్పుడు ప్రారంభిస్తారోనని మండల సమాఖ్య సభ్యులు వాపోతున్నారు. కాగా వానాకాలం సీజన్ దాటిపోయిన తర్వాత ప్రారంభించి ప్రయోజనం శూన్యమంటూ మహిళా సంఘాల సభ్యులు చర్చించుకుంటున్నారు.

ఎల్లారెడ్డిపేటకు సీఎం వరాల ఫ్లెక్సీ

- 2014 నుంచి సంక్షేమ పథకాలకు రూ.134.75 కోట్లు మంజూరు
- పూర్తి వివరాలతో ఫ్లెక్సీ ప్రదర్శన



అభివృద్ధి పనుల వివరాలతో ఫ్లెక్సీ ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మారుమూల గిరిజన వెనుకబడిన ఎల్లారెడ్డిపేట పట్టణాలకు దీటుగా అభివృద్ధిలో దూసుకుపోతోంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో పట్టణాలను తలపిస్తోంది. 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు మండల కేంద్రానికి రూ.134.75 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టింది. ఈ పనులకు సంబంధించిన వివరాలతో పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఆదివారం ఫ్లెక్సీని ప్రదర్శించారు. వివిధ సంక్షేమ పథకాలకు రూ.72.93 కోట్లు, ఆసరా, రైతుబంధు, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, రేషన్‌బియ్యం లాంటి పథకాల రూపంలో గ్రామానికి రూ.61.02కోట్లు కేటాయించినట్లు సర్పంచ్ తెలిపారు. అంతేకాకుండా శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి రూ.2.80 కోట్లు, పాఠశాల ఆధునీకీకరణకు రూ.8.50 కోట్లు మంజూరుచేయగా.. పనులు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ సహకారంతో ఎల్లారెడ్డిపేట అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. పూర్తి చేసిన పనుల వివరాలతో జిల్లాలోనే తొలిసారిగా పంచాయతీ కార్యాలయం ముందు ఫ్లెక్సీని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఎంపీడీవో చిరంజీవి, ఈవో దేవరాజు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

- పార్టీ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంగీతం శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్‌తోనే దేశంలో సంక్షేమ పాలన సాధ్యమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ముష్టిపల్లి, భూపతినగర్‌లోని పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక తరహాలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులను ప్రభుత్వం విస్మరిస్తోందని, రోజురోజుకూ కాంగ్రెస్‌పై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం పలువురు యువకులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ యువజన అధ్యక్షుడు చిందం శ్రీనివాస్, జిల్లా యుజన కార్యదర్శి అకినే సతీశ్, కాంగ్రెస్ నాయకులు అన్నల్‌దాస్ భాను, దేవరాజు, వేణు, మనోహర్, తదితరులున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



అనిల్ రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట (మానకొండూర్): ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన కోమటిరెడ్డి అనిల్ రెడ్డి (27) రెండేళ్లుగా తల్లిదండ్రులు సుధాకర్‌రెడ్డి–శ్యామలతో కలిసి హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆదివారం సాయంత్రం హోటల్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అనిల్ ఆత్మహత్య చేసుకున్నాడా... ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా అని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల మార్చురీకి తరలించారు. ఘటనా స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ మంద లక్ష్మణ్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ముస్తాబాద్ మండలం గోపాల్‌రావుపల్లికి చెందిన అనరాశి గౌతం, కిరణ్ ద్విచక్రవాహనంపై బండలింగంపల్లి వైపు వెళ్తుండగా అడవిపంది అడ్డుగా రావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



అంజవ్వ (ఫైల్)

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రానికి చెందిన దాసరి అంజవ్వ (65) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజవ్వ శుక్రవారం రాత్రి ఆవుదాడిలో గాయపడగా ఆస్పత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. బంధువులు మృతదేహంతో రుద్రంగి మండల కేంద్రంలోని కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించి న్యాయం చేయాలని ధర్నా చేపట్టారు. పోలీసులు సముదాయించడంతో ధర్నాను విరమించారు.

కాంగ్రెస్‌తోనే నిర్వాసితుల సమస్యలు పరిష్కారం

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

బోయినపల్లి (చొప్పదండి): మధ్యమానేరు ప్రాజెక్టు నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ.5.04 లక్షలు ఇస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, ఎనిమిదేళ్లు గడిచినా హామీలు అమలు కాలేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొదురుపాకలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 8 మొక్కలు నాటి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితులకు ఇచ్చిన హామీని ఆరునెలల్లో సీఎం కేసీఆర్ నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు అనుముల హరికృష్ణ, ఏనుగుల కనుకయ్య, తిమ్మాపురం సత్యనారాయణ, నాగుల వంశీ, తదితరులున్నారు.

'భగీరథ'తో తాగునీటి కష్టాలు దూరం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



సిబ్బందిని సన్మానిస్తున్న తోట ఆగయ్య, తదితరులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రాష్ట్రంలో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటింటికీ నల్లానీరు అందించడంతో గ్రామాలు, తండాల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు తీరాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలో ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. నీళ్ల ట్యాంకుల దగ్గర సంబరాలు జరిపారు. మంచినీటి విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ.. ఇంతకుముందు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉండేదని, సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నారన్నారు. స్వచ్ఛమైన భగీరథ నీటినే తాగాలని కోరారు. గ్రామాల్లో భగీరథ నీటిపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుకా, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, ఎలగందుల అనసూయ, ఎంపీడీవో చిరంజీవి, ఆయాగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నీటి నిర్వహణ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ట్రినిటీ విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ(అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. ఎ.అభిరామ్ 415వ ర్యాంకు, ఎస్.సాచి 800, జి.దిలీప్ 908, కె.గోపాల్ 1,017, జి.గంగాధర్ 1,117, ఎం.రాజారెడ్డి 1,137, ఎస్.సుహాస్‌రెడ్డి 1,430, పి.అభినయ 1,674వ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్, అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం



పల్లె బిందు



పవన్ సూర్య



శ్రీవాత్సవ



సాయిప్రభాస్

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ –2023 ఫలితాల్లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరచి జాతీయస్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ఎస్.పవన్ సూర్య 903వ ర్యాంకు, పల్లె బిందు 2,467, మారుపాక శ్రీవాత్సవ 3,159, కల్వల సాయిప్రభాస్ 4,295వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, అంకితభావంతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో శ్రీచైతన్య విద్యా సంస్థలు నడుస్తున్నాయని వివరించారు. శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ జూనియర్ కళాశాల స్థాపించిన నాటి నుంచి రాష్ట్రస్థాయి ర్యాంకులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కళాశాలల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఐఐటీ ఫలితాల్లో శ్రీచైతన్య ఐపీఎల్ ప్రతిభ

కరీంనగర్: జేఈఈ అడ్వాన్స్–2023 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్లోని శ్రీ చైతన్య ఐపీఎల్ విద్యార్థులు సత్తాచాటారు. జిందం శ్రీనాథ్ ఆల్ ఇండియా 151వ ర్యాంక్, ఎం. రిషికేష్ ఆల్‌ఇండియా 158వ ర్యాంక్ సాధించారు. ఏ.శశిధర్ 902, టి.మణిశరవన్‌గౌడ్ 11,24, బి.అరిన్‌పటేల్ 1,726, ఎస్.సాయికృష్ణ 4,548, ఎం.హరిత్ 5,076, పి.కీర్తి 6,012, జె.శ్రీజ 8467 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, ఆర్ఐ రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్, ఐపీఎల్ ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జి మధుకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కేసు పక్కదారి పట్టిస్తున్నారు

- బోయినపల్లి ఎస్సై, వేములవాడ రూరల్ సీఐని సస్పెండ్ చేయాలి
- లింగంపేట గ్రామస్తుల ఆందోళన



ధర్నా, రాస్తారోకో చేస్తున్న లింగంపేట గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేటకు చెందిన యువకుడు బండారి శివ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, ఆ గ్రామస్తులు ఆదివారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ బోయినపల్లి ఎస్సై, వేములవాడరూరల్ సీఐలను సస్పెండ్‌చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న చందుర్తి ఎస్సై రమేశ్ లింగంపేటకు చేరుకోగా.. బాధితులు ఆందోళనను తీవ్రం చేశారు. దీంతో రుద్రంగి, కోనరావుపేట ఎస్సైలు ప్రభాకర్, రమాకాంత్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఎన్గల్‌లో ఆందోళనకు దిగిన సమయంలో న్యాయం చేస్తామని చెప్పి ఎందుకు స్పందించలేదని చందుర్తి ఎస్సై రమేశ్‌ను ప్రశ్నించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

మృతిపై అనుమానాలు

చందుర్తి మండలం లింగంపేటకు చెందిన బండారి శివ(19) గత ఏప్రిల్ 11న బోయినపల్లి మండలం కోరెంలో జరిగిన బీరప్ప ఉత్సవాలకు బంధువుల ఇంటికి వెళ్లాడు. అదే ఉత్సవాలకు యువకుడి ప్రియురాలు చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన యువతి హాజరైంది. ఉత్సవాల్లో యువతిని సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీయగా.. ఆమె బంధువులు శివ సెల్‌ఫోన్‌ను లాక్కొని ఫొటోలు డిలీట్ చేశారు. అంతేకాకుండా శివ చెంపపై కొట్టి అక్కడిని నుంచి పంపించినట్లు ప్రచారం జరిగింది. రెండురోజుల తర్వాత ఇంటికొస్తుండగా మార్గమధ్యలో బైక్‌పై నుంచి పడిపోయి కనిపించాడు. తీవ్రంగా గాయపడిన శివను హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఏప్రిల్ 15న మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ మాత్రం తన కుమారుడిపై దాడి చేశారని ఆరోపిస్తున్నాడు. అనుమానితులపై బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏప్రిల్ 16న ఎన్గల్‌లో మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో పోలీసులు నిందితులను పట్టుకొని శిక్షిస్తామని హామీ ఇచ్చారు. రెండు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.